# గత స్మృతులు

విన్నకోట రామచంద్రరావు

జీవితపథంలో యవ్వనం ఒక బంగారుపుటం. ఆదశలో జరిగే సంఘటనలు, పొందే అనుభూతులు అనేకం. ఆ అనుభూతులు, అనుభవాలు మరపురానివి, మరువలేనివి. మనం కావాలనుకొన్నా, వద్దనుకొన్నా అవి జీవితాంతం మనల్ని చల్లగా స్ఫురిస్తూనే ఉంటాయి.

గట్టిగా కూతవేసి బయల్దేరింది రైలు. చెట్లు, పొలాలు గిరగిరా తిరుగుతూ వెనక్కి మళ్ళిపోతున్నాయి. పల్లె పడుచులు వయ్యారం ఒలకబోస్తూ కలుపుతీస్తున్నారు. నేల ఆకుపచ్చని తివాసిలా ఉంది. దూరాన ఉన్న నీలి కొండలు, సూర్యుని లేతకిరణాలు పడి మెరుస్తున్నాయి. కంపార్ట్‌మెంట్ అంతా పరికించాను. ఒక యువతి, ఆమె తల్లి (కాబోలు) మాత్రం ఉన్నారు. ఆ యువతి ప్రకృతి శోభను తన్మయత్వంలో తిలకిస్తోంది. పత్రిక తెరచి చదవడం మొదలుపెట్టాను. ఇంతలో బాత్‌రూం తలుపు చప్పుడైంది. అటుచూసాను. అంతే నిశ్చేష్టుడనయ్యాను. ఎదురుగా సూర్యనారాయణ! 'ఏంరోయ్' అని పలకరించాడు. కుశల ప్రశ్నలయ్యాక, 'ఎక్కడికి వెళ్తున్నావ'ని అడిగాను. నవ్వుతూ, 'అత్తగారింటికి' అన్నాడు. తరువాత సంభాషణ రాజకీయాలవైపు, తరువాత కాలేజీ రోజులవైపు మళ్ళింది. 'ఒరేయ్! విజయ ఇప్పుడు విశాఖపట్టణంలో ఉంది. ఆవిడ భర్త కాల్టెక్స్‌లో పనిచేస్తున్నాడు' అన్నాడు. నాగుండె క్షణకాలం స్థంభించినట్టయింది. ఇష్టంలేకపోయినా, మనస్సు గతంలోకి పరిగెడుతోంది బుర్ర వేడెక్కింది. 'భాగ్యం అంటే మనసులో ఆలోచనలు చెప్పుకోకపోవడం. మంచితనం అంటే ఒకరి జోలికి పోకుండా ఉండడం' అని భోగేశ్వర్రావు అన్న మాటలు గుర్తుకువచ్చాయి. వాడు ఇంటర్లో నా క్లాస్‌మేట్. ఆలోచనలు పారద్రోలటానికి సిగరెట్ వెలిగించాను. పత్రిక తెరిచాను, కాని పత్రికలో అక్షరాలు అలుక్కుపోయినట్టు కనబడుతున్నాయి. గత స్మృతులు మెదడులోకి దూసుకుపోతున్నాయి. మనస్సు స్పుత్నిక్‌లా గతంలోకి పరుగెత్తింది.

అవి నేను ఇంటర్ చదివే రోజులు. యవ్వన దశ తొలిరోజులు. జీవితం అంటే ఏమిటో పూర్తిగా తెలియని రోజులు 'జీవితం జీవించడానికే' అనే వేదాంతం నాది. ఎప్పుడు చలాకీగా, హుషారుగా ఉండేవాడిని. కష్టాలంటే ఏమిటో నాకు తెలియదు. జీవితం నాకు వడ్డించిన విస్తరి. స్నేహితులతో సరదాగా కాలం వెళ్ళబుచ్చేవాడిని. ఏవేవో ఊహాలోకాల్లో విహారం చేసేవాడిని.

ఒకరోజు ఇంగ్లీషు క్లాసు జరుగుతోంది. లెక్చరరు ఉత్సాహంగా పాఠం చెప్తున్నారు. మేమంతా ఆసక్తిగా వింటున్నాం. ఇంతలో 'మే ఐ కమిన్ సర్!' అని వినబడింది. చిరాగ్గా అటుచూసాను. ఎవరో అమ్మాయి బెదురుగా చూస్తూ నిలబడింది. 'యస్ కమిన్' అన్నారు లెక్చరర్. ఆమె అడుగులో అడుగువేసుకొంటూ వెళ్ళి, సీట్లో కూర్చుంది. ఆమెవైపు చూసాను. సన్నగా, బంగారు తీగలా ఉంది. ఆమె ముఖంలో అమాయకత్వం కొట్టవచ్చినట్టు కనబడుతోంది. ఆమె కళ్ళల్లో ఏదో వింత కాంతి. అదే సమయంలో ఆమె తలఎత్తి నావైపు చూసింది. చూపులు కలుసుకొన్నాయి. నేను ఆమెను చూసి కొంటెగా నవ్వాను. ఆమె నవ్వింది, అప్పుడే విచ్చిన కుసుమంలా, మబ్బులచాటు మెరుపులా. ఇంతలో గంట మ్రోగింది. లెక్చరర్ వెళ్ళిపోతూ, ఆమె పేరు అడిగారు. 'విజయ' అని చెప్పింది. ఎంత తియ్యటి పేరు.

సాయంత్రం చల్లగా గాలివీస్తోంది. నీరెండలో డాబామీద కూర్చుని నవల చదువుతున్నాను. గాజులు గలగలమన్నాయి. తలెత్తాను, ఆమె ఎదురింటి డాబామీద నిలబడి నవ్వుతోంది! అదేనవ్వు, ఎదుటివాళ్ళ ప్రాణాలని తీసేనవ్వు!

మరునాడు కాలేజీకి బయల్దేరాను, గుమ్మంలోనే ఆమె ఎదురైంది. తన్ను పరిచయం చేసుకొంది. ఆమె కాలేజీలో చేరకముందు జరిగిపోయిన పాఠాలలిస్టు శ్రద్ధగా తీసుకొని వెళ్ళిపోయింది. రోజులు గడుస్తున్నాయి విజయ నాకు మరింత సన్నిహితమైంది. పరీక్షలు ముగిసాయి, అప్పటికి నేనామెను ప్రేమిస్తున్నట్టు గ్రహించగలిగాను. ఆమె అంగీకారాన్ని తెల్సుకొని, వివాహం చేసుకోవాలనుకొన్నాను.

సాయంత్రం ఆరుగంటలైంది. విజయ ఇంటికి తడబడుతూ, అడుగులు వేసుకొంటూ వెళ్ళాను. ఇంట్లో ఎవరూ లేరు. ఆమె ఒకతె రేడియో వింటోంది. ఏంచెప్పాలో, తెలియడంలేదు 'పరీక్షలు బాగా వ్రాసావా?' అని అడిగింది. 'ఓ' నన్నట్టు తలూపాను. ఆ తరువాత ఆమె పాటువింటూ కూర్చుంది. ధైర్యాన్ని కూడబెట్టుకొని, నెమ్మదిగా, 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను, విజయా! నీ కిష్టమే?' అని అడిగాను. ఆమె నిర్లక్ష్యంగా నవ్వుతూ, 'క్షమించు రాజూ! నేనెప్పుడు నిన్ను ఆ భావంతో చూడలేదు.' అంతే, అంతే, వెనక్కి తిరిగి వడివడిగా అడుగులువేస్తూ వచ్చేసాను. గుండె ఎవరో పిండుతున్నట్టయింది. బుర్రలో ఆటంబాంబులు పేలుతున్నాయి. ఎవరో సుత్తితో మెదడుమీద కొడుతున్నట్టయింది. తల తిరుగుతోంది.

◆ ◆ ◆

మొదటిసారిగా ఆ రాత్రి మైకం కమ్మేవరకు త్రాగాను. తూలుతూ, అందరికీ చిరపరిచితమైన పెంకుటింటి తలుపుతట్టాను. నెమ్మదిగా తలుపు తెరచుకొంది. లోపలికి అడుగుపెట్టాను. ఒక యువతి నా చెయ్యి పట్టుకొని మంచంమీద కూర్చోబెట్టింది. ఆమె పల్చని నైలాను బట్టలు వేసుకొంది. ఒక మూలగా మాసిన బట్టలు కుప్పగా పడి ఉన్నాయి. మరోక మూల టేబిల్ ఉంది. టేబిల్ మీద చిన్న అద్దం, చవక రకం పౌడరు

(తరువాయి 23-24 వ పేజీ)

## కీడులో మేలు

(4,5వ పేజి తరువాయి)

పెరోక్కని, కొత్త మిత్రాన్ని నిరుత్సాహపరచడం రష్యా అభిమతం కాదు

కాని పాకిస్తాన్ భారతదేశాల మధ్యనే ఎన్నుకోవలసి వచ్చినప్పుడు తప్పనిసరిగా భారతదేశాన్నే రష్యా ఎంచుకొంటుంది. అంతే కాదు. చైనా ప్రాబల్యం తనకే ప్రమాదకరంగా పరిణమిస్తోందన్న విషయం రష్యా గ్రహించింది. ఆసియాలో చైనాను అడ్డుకునే శక్తిగా భారత్ బలపడ్డం రష్యాకే శ్రేయస్కరం. ఈ విషయం రష్యాకూడ గ్రహించింది.

అమెరికా రష్యాల రెండింటికీ సన్నిహితంగా వుంటూ మన విదేశాంగ విధానాన్ని మన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా మలచుకోవలసిన అవసరం నేడు చాల వుంది. ఇది చాల కష్టసాధ్యమైన విషయం. కాని నేర్పు ఓర్పు దూరదృష్టితో దీనిని సాధ్యం చేయవలసి వుంది.

ఈ దురాక్రమణ వలన విదేశాలలో మన ప్రచారం చాల లోపభూయిష్ఠంగానూ, చాల అసంతృప్తికరంగానూ జరుగుతున్న విషయం తేటతెల్లమయింది

అనేక దేశాలకు వాస్తవిక పరిస్థితులను తెలియచేయలేని స్థితిలో మనం వున్నామంటే అంతకంటే దౌర్భాగ్యం మరొకటి వుండదు

సమర్థులైన మన ప్రతినిధులు మన పట్ల సద్భావమున్న దేశాలలో పర్యటించి, అచ్చటి ప్రజల ప్రభుత్వాభిప్రాయాలను ప్రభావితం చేయవలసి వుంది.

భారత స్వాతంత్ర్యాన్ని సంరక్షించుకోవడానికి భారతీయులు ఒక్కత్రాటిపై నిలబడగలరని, ఎటువంటి త్యాగాన్నయినా చేయగలరన్నది ప్రపంచ ప్రజలకు స్పష్టమయింది భారతీయ సైనిక శక్తి ఎటువంటిదో కూడ స్పష్టమయింది మన ప్రతిష్ఠ ఇనుమడించింది.

దౌత్యరంగంలో కూడ మనం విజయం సాధించగలిగిననాడు, మన ప్రయోజనాలకు అనుగుణంగా మన విదేశ విధానాన్ని మరల్చుకోగలిగిననాడు భారతదేశంపై పాకిస్తాన్ చేసిన దాడి కీడులో మేలే కాగలదు.

## గత స్మృతులు

డబ్బా ఉంది. గోడకు దేముడిపటం వ్రేలాడుతోంది! ఆమె నా దగ్గరగా జరిగింది. ఆమె బట్టలనుండి దుర్గంధం వస్తోంది. పైన ఫేన్ శబ్దంచేస్తూ తిరుగుతోంది. ఆవేశంతో ఆమెకు దగ్గరగా జరిగాను.

◆ ◆ ◆

కళ్లు తెరిచాను చుట్టూ చీకటి తడుముకొంటూ స్విచ్చి వేసాను. లైట్ వెలిగింది. నా మైకం వదిలింది. నాపాపానికి చిహ్నంగా నలిగిన సంపెంగపూలు తలగడామీద చెదురుగా పడిఉన్నాయి. నాపై నాకే అసహ్యం వేసింది ఈ లోకంపై అసహ్యం వేసింది. ఆమె మెల్లిగా కళ్లు తెరిచి, నన్ను చూసి నవ్వింది. నేను నవ్వాను అది జీవంలేని నవ్వు, జీవితంలో ఓడిపోయినవాడి నవ్వు. కాలగర్భంలో కలిసిపోతూ నవ్విన వాడి నవ్వు అది! పర్సుతీసి ఆమె ముఖాన విసరికొట్టాను.

నిజానికి ఈ దుర్వ్యసనాలకు దాసుడవాలని నేనేనాడు అనుకోలేదు. కేవలం నా బాధల్ని మర్చిపోడానికే అలా చేసాను. కాని ఆనాడు వెలిగించిన సిగరెట్ మాత్రం ఈనాటివరకు నా చేతిలో వెలుగుతూనే ఉంది! ఆ తరువాత వివాహం చేసుకొమ్మని నాన్న ఎంత బ్రతిమాలినా చేసుకోలేదు ఎంతోమంది లక్షలు కట్నంతో పిల్లనిస్తామన్నారు, మరెందరో సుందరాంగులు వివాహం చేసుకోడానికి సమ్మతి తెలిపారు. అందరికీ ఒకే సమాధానం, 'మానవుడు జీవితంలో ఒకేసారి ప్రేమించగలడు! సిగరెట్ చివరంటా కాలి చేయి చురుక్కుమంది.

◆ ◆ ◆

వాస్తవిక జగత్తులోకి ఊడిపడ్డాను. సూర్యనారాయణ నిద్రపోతున్నాడు. గతస్మృతుల పునస్మరణతో మనస్సు తేలికపడింది. ప్రకృతిని చూస్తూ నవ్వాను వేదాంతిలా!


# నీవు సైనికుడవు కూడ

## సవాలును ఎదుర్కొనుటకు నీవు ఏమి చేయుచున్నావు?

DA-65/71